

కొత్త కోర్సులు గురూ..

జీఆర్‌ఏయూలో కొత్త కోర్సులు అమలవుతున్నాయి. నాలుగేళ్ల డిగ్రీ మొదలైంది.

- 8లో



ఉత్సాహంగా ఆటల పోటీలు

అంతర పాలిటెక్నిక్ కళాశాలల ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. విద్యార్థులు సత్తా చాటుతున్నారు.

- 8లో

నేడు జిల్లా బార్ అసోసియేషన్ సమావేశం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఏపీ ల్యాండ్ టైటిలింగ్ మార్పు రద్దుపై జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ల్యాండ్ టైటిలింగ్‌పై చర్చించేందుకు హైకోర్టులో పిల్ వేసేందుకు నిర్ణయం కోసం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశానికి న్యాయవాదులు హాజరవ్వాలని కోరారు.

న్యూస్‌రీల్

వారి నేత్రాలు సజీవం



వరహాలమ్మ



మాచెర్ల గౌరీశంకర్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో గురువారం ఇద్దరు మృతి చెందగా.. వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రాలు సేకరించారు. అరసవల్లి ప్రాంతానికి చెందిన అరుగుల వరహాలమ్మ (85), గవర వీధికి చెందిన మాచెర్ల గౌరీశంకర్(46) మృతి చెందారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు నేత్రదానంపై వీరి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో ఒప్పుకున్నారు. దీంతో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా వారి కార్నియాలను సేకరించి విశాఖ, ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందించారు. ఆ కుటుంబాలను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు. ఎవరైనా నేత్ర దానం చేయాలనుకుంటే 7842699321 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సముద్రంలో మునిగి మత్స్యకారుడు మృతి



వజ్రపుకొత్తూరు: కొత్తపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు గుంటు యర్రయ్య(58) గురువారం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సముద్రంలో మునిగి మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన మత్స్యకారులు కొండ పున్నయ్య, వంక లింగరాజుతో కలిసి యర్రయ్య సముద్రంలో చేపలు వేటకు వెళ్లారు. పడవను తెడ్డు సాయంతో నడుపుతున్న క్రమంలో అదుపు తప్పి సముద్రంలోకి పడిపోయారు. గమనించిన తోటి మత్స్యకారులు సముద్రంలో దూకి పడవలోకి చేర్చారు. అయితే యర్రయ్య అప్పటికే మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. యర్రయ్యకు భార్య గౌరి, ఓ కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బి.అప్పలస్వామి ఆదేశాలతో స్థానిక వీఆర్‌ఓ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ఎ.శ్రీను కోరారు.

నేడు ముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హుండీ ఆదాయం శుక్రవారం లెక్కించనున్నామని ఈఓ పి.ప్రభాకరరావు గురువారం తెలిపారు. కార్తీక మాసం అనంతరం స్వామివారి హుండీ లెక్కింపులో ఆసక్తి గల భక్తులు పాల్గొంటారని ఆయన కోరారు.

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు వద్ద సౌత్ బ్రేక్ వాటర్ పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కల్యాణి నర్తు రామారావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, పేరాడ తిలక్, దువ్వాడ వాణి తదితరులు



మూలపేట పోర్ట్.. భవితకు సపోర్ట్

- వచ్చే ఏప్రిల్ నాటికి షిప్ ట్రైల్ రన్‌కు ప్రయత్నిస్తాం
- పోర్టుకు భూములిచ్చిన వారందరికీ న్యాయం చేస్తాం
- మూలపేట పోర్టుతో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి
- గత టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో పోర్టును ఎందుకు నిర్మించలేకపోయారు.?
- మూలపేట పోర్టు పనులను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు

టెక్కలి, సంతబొమ్మాళి, టెక్కలిరూరల్: మూలపేట పోర్టు భవిష్యత్‌లో ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం సాధిస్తుందని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు అన్నారు. ఎమ్మెల్సీలు, సమన్వయకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు పనుల ప్రగతిని గురువారం పరిశీలించారు. ముందుగా వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు అమర్‌నాథ్, అప్పలరాజు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, స్థానిక సర్పంచ్ జీరు బాబురావు, జెడ్పీటీసీ పాల వసంత్ రెడ్డి తదితరులు పోర్టు వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సౌత్ బ్రేక్ వాటర్ పనులను పరిశీలించారు.సౌత్ బ్రేక్ వాటర్ పనులు, బెర్త్‌ల నిర్మాణాలు, అప్రోచ్ రోడ్డు పనులు, రైల్వే రోడ్డు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, పోర్టు ప్రగతి డిస్‌ప్లేను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా వినతు లు స్వీకరించారు. వీరితో పాటు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, వరుదు కల్యాణి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, టెక్కలి, ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దువ్వాడ వాణి, పిరియా సాయిరాజ్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఏఎంసీ చైర్మన్ ఎస్.పుణ్యావతి, విశ్వ సముద్ర జీఎం శంకర్, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్మన్ పి.రాజ్యలక్ష్మి, నాయకులు బి.నాగేశ్వరరావు, పి.రవికుమార్‌రెడ్డి, డి.జగన్, ఎం.అప్పారావు, ఎస్.శ్రీరామ్మూర్తి, కె.చిరంజీవులు, నిమ్మనదాసు, బి.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగదు



పోర్టు కోసం భూములు ఇచ్చి న రైతులకు అన్యాయం జరగకుండా పూర్తిస్థాయిలో నష్ట పరిహారం ఇచ్చాం. ఇంకా ఎక్కడైనా పెండింగ్ ఉంటే తక్షణమే పరిష్కరిస్తాం. వచ్చే ఏప్రిల్‌లో మూలపేట పోర్టు నుంచి షిప్ ట్రైల్ రన్ చేసేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎన్నో దశాబ్దాలుగా కలగా ఉండిపోయిన పోర్టును టీడీపీ ఎందుకు నిర్మించలేకపోయింది? జిల్లాను అభివృద్ధి చేయడానికి సీఎం వైఎస్ జగన్ సంకల్పించారు. కిడ్నీ ఆస్పత్రి, శుద్ధజలం ప్రాజెక్టు లే అందుకు నిదర్శనం. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అభివృద్ధి తామే చేశామంటూ ప్రతిపక్షాలు ప్రజల ముందుకు వస్తాయి. వారిని నమ్మొద్దు.

– వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్



ఫొటో ఎగ్జిబిషన్ వివరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



పోర్టు డిజైన్ పరిశీలిస్తున్న నాయకుల బృందం

విశాఖతో పోటీ పడుతుంది



మూలపేట పోర్టు నిర్మాణంతో సమీప భూముల్లో పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుంది. రాష్ట్ర ప్రజలకు చరిత్రాత్మకమైన ప్రాజెక్టులను అందజేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన చేస్తున్నారు. జిల్లాలో కలగా మిగిలిన పోర్టు నిర్మాణాన్ని సాకారం చేసింది సీఎం వైఎస్ జగన్. పోర్టు ఉండడంతోనే విశాఖపట్టణానికి గుర్తింపు వచ్చింది. భవిష్యత్‌లో మూలపేట ప్రాంతం విశాఖతో పోటీ పడుతుంది. గత 14 ఏళ్ల టీడీపీ పాలనతో స్థానిక టీడీపీ నాయకులు పోర్టు ఎందుకు కట్టలేకపోయారు.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమల శాఖ మంత్రి

సెల్ఫీ పెట్టగలరా..?



చంద్రబాబు ఎక్కడైనా పోర్టు నిర్మాణం చేసి ఉంటే లోకేష్ అక్కడ నిలుచుని సెల్ఫీ పంపించగలరా..? నేను మూలపేట పోర్టు వద్ద నిలుచుని ఫొటో పెడతాను. 14 ఏళ్ల టీడీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో తీరం ఉందని చంద్రబాబుకు గుర్తు లేదు. ఇటీవల టెక్కలి నియోజకవర్గంలో అచ్చెన్నాయుడు చేసిన బైక్ ర్యాలీని కాస్త మూలపేట ప్రాంతం వైపు టర్న్ చేసి ఉంటే, మీకు చేతకానిది.. చంద్రబాబు కలలో ఊహించలేనిది.. సీఎం వైఎస్ జగన్ సుసాధ్యం చేశారని తెలిసి ఉండేది. సీఎం వైఎస్ జగన్ పాలనలో ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, బుడగట్లపాలెం హార్బర్, భోగాపురం ఎయిర్‌పోర్టు, హిరమండలం ఎత్తిపోతల పథకం, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, శుద్ధజలం, సీతంపేటలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, విజయనగరంలో మెడికల్ కాలేజ్, సాలూరులో గిరిజన యూనివర్సిటీ, విశాఖ హార్బర్‌కు రూ.150 కోట్లతో ఆధునికీకరణ, పూడిమడక లో హార్బర్, నర్సీపట్నంలో మెడికల్ కాలేజ్, చింతపల్లి, భీమిలీ, రాజయ్యపేట వద్ద ఫిష్ ల్యాండింగ్ పనులు, విశాఖలో అదానీ డేటా సెంటర్, ఇన్ఫోసిస్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని రొమ్ము విరుచుకుని చెప్పగలం. మీరు చెప్పగలరా.?

– సీదిరి అప్పలరాజు, మత్స్యశాఖ మంత్రి

సమర్థవంతమైన పాలన



ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సీఎం వైఎస్‌జగన్ ఆలోచన చేస్తున్నారు. సమర్థవంతమైన పాలనకు నిదర్శనం మూలపేట పోర్టు. ఉద్దానం రూపు రేఖలు మార్చే విధంగా కిడ్నీ రీసెర్చ్ సెంటర్, శుద్ధజలం అందజేశారు. టీడీపీ నాయకులకు ఎలా గెలవాలనే ఆలోచన తప్ప, అభివృద్ధి కోసం ఆలోచన ఉండదు.

– ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే

కష్టాలు తీరంగ.. ఇంటికే గంగ



వేసవి వస్తే చెలమ వెతుక్కునే వేదన ఇక ఉండదు. దాహం తీరే దారి తెలీక దశాబ్దాలుగా పల్లెలు పడుతున్న యాతన ఇక కనిపించదు. నేరుగా ఇంటికే మంచినీటిని అందించే బృహత్తర కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోంది. రూ.1237 కోట్ల వ్యయంతో ఐదు లక్షలకు పైగా ఇళ్లకు కుళాయిలను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే సగం ఇళ్లకు కుళాయిల ఏర్పాటు పూర్తవ్వగా మిగిలిన పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి.



టెక్కలి మండలం జయకృష్ణపురంలో ఇంటింటికి ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు

- దీర్ఘకాలిక తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- రూ.1237 కోట్లకు పైగా వ్యయంతో మంచినీటి పథకాలు, ఇంటింటి కుళాయిలు
- జిల్లా వ్యాప్తంగా 5,39,302 ఇళ్లకు కుళాయిల ఏర్పాటు లక్ష్యం
- ఇప్పటికే 2,18,841ఇళ్లకు కుళాయిల ఏర్పాటు
- శరవేగంగా మిగిలిన పనులు

నీటి కష్టాలు తీరాయి



గతంలో నీరు తెచ్చుకునేందుకు ఊరి చివరి ఉన్న కుళాయికి వెళ్లే వాళ్లం. అలాంటిది నేడు ఇంటి వద్ద మంచినీటి కుళాయి ఏర్పాటు చేయడంతో ప్రయాసలు తప్పాయి. 24గంటలు కుళాయిల ద్వారా మంచినీరు వస్తుంది. ఎన్నో ఏళ్లుగా తీరని నీటి కష్టాలు నేటికి తీరాయి.

– ఇరగటం వజ్రం, జయకృష్ణపురం, టెక్కలి మండలం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఒకటి కాదు రెండు కాదు రూ. 1237కోట్లకు పైగా వ్యయం. ఒక ఇల్లు కాదు రెండిళ్లు కాదు.. ఐదు లక్షలకు పైగా ఇళ్లు. ఎండలు మండితే దాహమో రామచంద్రా అని రోదించే ఊళ్లకు ప్రభుత్వం చల్లటి కబురు అందిస్తోంది. ఇంటికే శుద్ధమైన తాగునీరు అందించేందుకు కుళాయిలు ఏర్పాటు చేస్తోంది. అలాగే గ్రామీణ ప్రాంతంలో తాగునీటి వనరులు పెంచుకోవడానికి గాను ప్రతి ఇంటికీ మంచినీటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికీ పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకోసం ఆయా గ్రామాల్లో అవసరమైన చోట తాగునీటి ట్యాంకులను కూడా నిర్మిస్తున్నారు. వ్యక్తిగత గృహ కుళాయి కనెక్షన్ల ద్వారా అన్ని గ్రామీణ గృహాలకు, స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామాల్లో నీటి సరఫరాకు మౌలిక సదుపాయాలను రూపొందించడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం, సమర్థంగా అమలు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.

శాశ్వత పరిష్కారం..

తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జల జీవన్ మిషన్ సాయంతో ఊళ్లకు అవసరమైన చోట భారీ నీటి బదిలీ, పంపిణీ నెట్‌వర్క్‌లు, ట్రీట్‌మెంట్ ప్లాంట్లు అందుబాటులో ఉంచుతోంది. ఖర్చుకు ఏ మాత్రం వెనుకాడకుండా నదుల్లో ఊటబావులు ఏర్పాటు చేసి, సుదూర ప్రాంతాలకు పైపులైన్లు వేసి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తోంది.



ఆమదాలవలస మండలం చిన్న జొన్నవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం చేతుల మీదగా అందించిన తాగునీటిని తీసుకెళ్తున్న మహిళ

నాగావళిలో చెలమలు తీసే పరిస్థితి తప్పింది



నాగావళి నది తీరం పక్కనే మా గ్రామం ఉంది. నది పక్కనే ఉన్నా మాకు తాగునీటి సౌకర్యం గతంలో ఉండేది కాదు. తాగునీటి కోసం నాగావళి తీరానికి వెళ్లి చెలమలు తీసుకుని తాగునీటి సేకరించే వాళ్లం. నీటి కోసం అష్ట కష్టాలు పడేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామానికి ఇంటింటా తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు కుళాయిల ద్వారా తాగునీటిని పొందుతున్నారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– పేడాడ భార్గవి, ఇసకల పేట గ్రామం, ఆమదాలవలస మండలం.

మొత్తం పనులు **4822**

పూర్తయినవి : **725**

ప్రగతిలో ఉన్నవి **1391**

ప్రారంభ దశలో ఉన్నవి **2439**

నియోజకవర్గం	ఆమదాలవలస	ఎచ్చెర్ల	ఇచ్ఛాపురం	నరసన్నపేట	పలాస	పాతపట్నం	శ్రీకాకుళం	టెక్కలి	మొత్తం
మొత్తం పనులు	344	617	620	636	631	825	363	786	4822
కేటాయించిన నిధులు (రూ. కోట్లలో)	157.32	195.22	138.66	158.82	150.70	177.60	98.02	161.00	1237.36



ఇచ్ఛాపురం మండలం ఇన్నేసుపేట వద్ద నిర్మించిన వాటర్ ట్యాంకు

'మార్పు కోసం ప్రయత్నించాలి'

గార: ఖైదీగా ఉన్న సమయంలో మార్పు కోసం ప్రయత్నించాలని జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎస్‌కే నబీఖాన్ అన్నారు. ఆయన గురువారం అంపోలులోని జిల్లా జైలులో సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. జైల్లో ఉన్న ఖైదీల్లో పరివర్తన కోసం వివిధ రంగాలకు చెందిన నిపుణులతో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జైలర్లు దివాకర్‌నాయుడు, ఎస్.ఉదయభాస్కర్, జైలర్ ఎస్.రామకృష్ణ, ఎన్‌జీఓ ప్రతినిధి పి.శ్రీనివాస్, బీవీ రవికుమార్, ఎల్.లక్ష్మణరావు, డాక్టర్ బి.సాయిరాం, ఎస్.వాసు, ఎం.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎస్‌కే నబీ ఖాన్

వస్త్ర వ్యాపారంలో ఎస్ఆర్ ఓ బ్రాండ్



హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, నేహాశెట్టి సందడి

- ఎస్ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని, మంత్రి సీదిరి
- సందడి చేసిన సినీతారలు నేహాశెట్టి, పాయల్‌రాజ్‌పుత్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వస్త్ర వ్యాపారంలో ఎస్ఆర్ షాపింగ్ మాల్ ఓ బ్రాండ్‌గా నిలిచిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శ్రీకాకుళం నగరంలో జీటీ రోడ్డులో ఎస్ఆర్ షాపింగ్ మాల్ రెండో బ్రాంచ్, ఏపీలో మొత్తంగా 14వ బ్రాంచ్‌ను గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా స్పీకర్‌తో పాటు పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు హాజరై మాట్లాడారు. వస్త్ర వ్యాపార రంగంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సుదీర్ఘకాలంగా మంచి పేరు సంపాదించుకుందన్నారు. 17 ఏళ్లుగా సుదీర్ఘ అనుభవంతో వినియోగదారులందరికీ అందుబాటు ధరల్లో దుస్తులు అందిస్తోందని చెప్పారు. ప్రారంభోత్సవానికి నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, అంబేడ్కర్ యూనివర్సిటీ నిమ్మ వెంకటరావు, తమ్మినేని చిరంజీవి నాగ్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, బల్ల గిరిబాబు, ఎన్ని ధనుంజయరావు, దుక్క రాజశేఖర్ రెడ్డి, ఎస్ఆర్ షాపింగ్ అధినేతలు గోపినాథరెడ్డి, డాక్టర్ ఎస్.ఎస్.ఎల్ ప్రసాదరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పూజారి, కేశవరెడ్డి, ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరెడ్డి, ఎజీఎమ్ రఘు, బ్రాంచ్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సందడి చేసిన హీరోయిన్లు

ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి ఆర్ఎక్స్–100, డీజే టిల్లు సినిమాల హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, నేహాశెట్టి సందడి చేశారు. షాపింగ్ మాల్ వద్ద పలు పాటలకు డ్యాన్స్ చేసి, డైలాగులు చెప్పి ఉత్సాహపరిచారు. ఎస్ఆర్ షాపింగ్‌మాల్స్ బ్రాంచ్‌లు మరిన్ని ప్రారంభించి వస్త్ర వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం ప్రజల అభిమానం తమ జీవితంలో మరిచిపోలేమన్నారు.



ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే కృష్ణదాస్, గోపినాథరెడ్డి

క్లుప్తంగా

బాక్సింగ్‌లో కాంస్య పతకం



ఎచ్చెర్ల క్యాంపస్: పంజాబ్ చండీగఢ్ విశ్వవిద్యాలయంలో సౌత్, వెస్ట్ అంతర వర్సిటీల క్రీడలు జరగుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నుంచి పాల్గొన్న బాక్సింగ్ క్రీడాకారుడు పి.అప్పలరాజు గురువారం 54–57 కిలోల బాక్సింగ్ విభాగంలో కాంస్యపతకం సాధించారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో బీపీఈడీ చదువుతున్నాడు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ఆదిత్యుని సన్నిధిలో నిర్మాత నట్టికుమార్



ఆదిత్యుని సన్నిధిలో నిర్మాత నట్టికుమార్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సినీ నిర్మాతల సంఘం ప్రతినిధి, ప్రముఖ నిర్మాత నట్టికుమార్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి దర్శనం చేయించారు.

జనవరిలో హెవీ డ్రైవింగ్ స్కూల్ బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం క్రైమ్ : నూతన సంవత్సరం సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ (15వ బ్యాచ్)ను జనవరి మొదటివారంలో జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పిస్తూ ఉత్తమ డ్రైవర్లుగా తీర్చిదిద్దడానికి ఏపీఎస్ఆర్టీసీ అన్నివిధాలా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫీజు, ఇతర వివరాల కోసం 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలన్నారు.

హరిదాసుకు కిలోన్నర పాదుకలు బహుమతి



పాదుకలను ఊరేగిస్తున్న ప్రజలు

పొందూరు: పొందూరులో హరినామ సంకీర్తలను చేస్తున్న హరిదాసు మజ్జి వీరాస్వామికి శ్రీరాముని వెండి పాదుకలను పొందూరు ప్రజలు బహుమతిగా అందించారు. పొందూరులో 85 కుటుంబాలు వారు కిలోన్నర వెండితో పాదుకలను తయారుచేయించి వీరాస్వామి, లక్ష్మి దంపతులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ. లక్ష 40 వేలు ఉంటుంది.

ఆలిండియా సౌత్ వెస్ట్ బాక్సింగ్ పోటీలకు గేయామృత

టెక్కలి: ఈ నెల 29 నుంచి 31 వరకు చండీగఢ్‌లో జరగనున్న ఆలిండియా సౌత్ వెస్ట్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు టెక్కలి క్రీడా వికాస కేంద్రానికి చెందిన బొడ్డ గేయామృత ఎంపికైనట్లు కోచ్ ఎస్.శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన గేయామృత ఆలిండియా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడంపై కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావుతో పాటు స్థానికులు అభినందించారు.

ఎంబీఏ, ఎంసీఏల్లో 11 మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ ప్రవేశాలు గురువారం ముగిశాయి. ఎంసీఏలో ఆరు స్పాట్లకు 25 మంది దరఖాస్తు చేసుకోగా, ఐసెట్ – 2023 ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ఆరుగురికి ప్రవేశాలు కల్పించారు. ఎంబీఏలో 16 సీట్లు ఖాళీలు ఉండగా, అర్హత గల వారు ఐదుగురు రావటంతో ప్రవేశాలు కల్పించారు. ఇంకా ఎంబీఏలో 11 సీట్లు మిగిలిపోయాయి.

కొత్త కోర్సులు గురూ..

- ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా కోర్సులు డిజైన్
- నూతన జాతీయ విద్యా విధానంలో -2020తో మారుతున్న పరిస్థితులు
- బీఆర్ఏయూలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ప్రారంభం



ఐటీఈపీ క్లాస్ వర్కు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉన్నత విద్య కొత్త పుంతలు తొక్కుతోంది. ఉపాధి, ఉద్యోగమే లక్ష్యంగా కొత్త కోర్సుల రాకతో సరికొత్తగా కనిపిస్తోంది. నూతన జాతీయ విద్యావిధానం విధానం-2020 అమలు చేస్తున్న నేపథ్యంలో విద్యా సంస్థలు వినూత్న కోర్సులు, సిలబస్‌ను తయారు చేసి అమలు చేస్తున్నాయి. అందులో భాగంగానే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం నాలుగేళ్ల సమీకృత విద్యా డిగ్రీ కార్యక్రమం (ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం) ప్రారంభించారు.

బీఆర్ఏయూలో..

విద్యార్థులు ఇంటర్మీడియట్ తర్వాత ఈ ఐటీఈపీలో నాలుగేళ్ల డిగ్రీలో చేరుతారు. ప్రస్తుతం బీఏ+బీఎడ్, బీఎస్సీ+బీఎడ్ కోర్సులు ప్రారంభించారు. జాతీయ వ్యాప్తంగా కొన్ని విశ్వవిద్యాలయాల్లో ఈ కోర్సులు ప్రారంభించగా, ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఒకటి. 110 సీట్లతో ఈ డిగ్రీ కోర్సులు ప్రారంభించారు. జాతీయ స్థాయిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ కౌన్సెల్ ఫర్ ఎడ్యుకేషన్ టెస్ట్ -2023లో అర్హత సాధించిన వారికి సీట్లు కేటాయించారు. బీఏ+బీఎడ్‌లో చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రం, బీఎస్సీ+బీఎడ్‌లో గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం సబ్జెక్టులు అమలు చేస్తున్నారు. డిగ్రీ మూడేళ్లు, బీఎడ్ రెండేళ్లు ఐదేళ్లు కాగా, నాలుగేళ్లలో డిగ్రీ + బీఎడ్ అర్హత విద్యార్థులకు లభిస్తుంది. బీఎడ్ చేసిన వారు స్కూల్ అసిస్టెంట్‌కు, డీఎడ్ చేసిన వారు సెకండరీ గ్రేడ్ టీచర్‌కు అర్హులు కాగా.. ఐటీఈపీ పూర్తి చేసిన వారు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (నేషనల్ కౌన్సెల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) మార్గదర్శకాల మేరకు స్కూల్ అసిస్టెంట్, సెకెండరీ గ్రేడ్ రెండింటికీ అర్హత పొందుతారు. మరో పక్క ఈ కోర్సుల్లో డ్రాపౌట్స్ నియంత్రణకు నూతన జాతీయ విద్యా విధానం మార్గదర్శకాలు అమలు చేస్తున్నారు. నాలుగేళ్ల డిగ్రీలో మొదటి ఏడాది పూర్తి చేస్తే సర్టిఫికెట్ కోర్సు, రెండో ఏడాది పూర్తిచేస్తే డిప్లమా కోర్సు, మూడేళ్లు పూర్తిచేస్తే డిగ్రీ కోర్సు, నాలుగేళ్లు పూర్తిచేస్తే డిగ్రీ+బీఎడ్ కోర్సుగా పరిగణిస్తారు. విద్యార్థికి ఏటా రిలీవ్ అయ్యేందుకు అవకాశం కల్పించారు.

భవిష్యత్ కోసమే..



మంచి భవిష్యత్ కోసమే ఈ కోర్సులో చేరాను. నాలుగేళ్ల కోర్సులో డిగ్రీ+బీఎడ్ రెండు డిగ్రీలు చేతికి వస్తాయి. ఉపాధ్యాయుల నియామక పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ రెండు పరీక్షలు రాయవచ్చు. ఉపాధ్యాయ విద్యకు సంబంధించి విస్తృత సిలబస్, క్షేత్ర పరిశీలనలు, ప్రయోగాలు విద్యలో చేర్చారు. ఈ సిలబస్ బాగుంది. బీఎడ్, డీఎడ్ విద్యార్థులతో పోల్చుకుంటే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు ఈ కోర్సుల్లో ఎక్కువగా ఉంటాయి.

– మౌనిక, విద్యార్థిని

కోర్సు డిజైన్ బాగుంది



ఈ కోర్సు సిలబస్ బాగుంది. డ్రాపౌట్ సమస్య లేకుండా డిజైన్ చేశారు. మూడేళ్ల డిగ్రీతో ఉద్యోగాలు సాధించినా రిలీవ్ కావచ్చు. విద్యార్థిపై ఒత్తిడి ఉండదు. విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యత ఇచ్చారు. డిగ్రీలో అమలు చేస్తున్న సబ్జెక్టులు సైతం భవిష్యత్‌లో ఉపయోగపడేవే. వర్సిటీలో సైతం క్లాస్‌వర్క్ పక్కాగా నిర్వహిస్తున్నారు. నాలుగేళ్ల డిగ్రీ తర్వాత మంచి భవిష్యత్ లక్ష్యంతో నేను ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాను.

– పి.సాయినాథ్‌రెడ్డి, విద్యార్థి

నిష్ణాతులైన ఉపాధ్యాయులు లక్ష్యంగా..



ప్రస్తుతం ఉపాధ్యాయ విద్యలో అనేక మార్పులకు నేషనల్ కౌన్సెల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ శ్రీకారం చుడుతోంది. దేశవ్యాప్తంగా అతి కొద్ది విద్యా సంస్థలు మాత్రమే నాలుగేళ్ల డిగ్రీ అమలు చేస్తున్నాయి. బీఆర్ఏయూ వాటిలో ఒకటి. నిష్ణాతులైన ఉపాధ్యాయులను తీర్చిదిద్దేలా సిలబస్ డిజైన్ జరుగుతుంది. బీఎడ్, డీఎడ్ రెండు కోర్సుల ప్రయోజనం ఈ విద్యార్థులకు ఉంటుంది. బోధనకు రెగ్యులర్ పోస్టులను సైతం మంజూరు చేశారు. భవిష్యత్‌లో ఇది అత్యంత డిమాండ్ ఉన్న కోర్సుగా మారుతుంది.

– ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వైస్ చాన్స్‌లర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

అంతర్ జిల్లాల టెన్నీకాయిట్ పోటీలు ప్రారంభం



41వ అంతరజిల్లాల టెన్నీ కాయిట్ పోటీల క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం మినీ స్టేడియం క్రీడా మైదానంలో 41వ రాష్ట్ర అంతర జిల్లాల స్త్రీ, పురుషుల టెన్నీకాయిట్ పోటీలను గురువారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు. 11 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి, ఎమ్మెల్యేకు గౌరవ వందనం చేశారు.

ఈ సందర్భంగా విద్యా ర్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కూడా గ్రామీణ క్రీడాకారుల కోసం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా టెన్నీ కాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు యెన్ని శేఖరబాబు, కార్యదర్శి వట్ట తవిటయ్య, ఎంపీపీ దోర సావిత్రమ్మ, జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అధ్యక్షుడు గురాడి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య కళాశాలలో శిక్షణలకు దరఖాస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న స్కిల్ కళాశాలలో నైపుణ్య శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ తెలిపారు. స్కిల్ కాలేజ్‌లో ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్ అంశంలో శిక్షణ ఇచ్చి, ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు తెలిపారు. 20 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు, డిగ్రీ ఉత్తీర్ణత అర్హతలని తెలిపారు. శిక్షణ కాలం మూడు నెలలని తెలిపారు. విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్సులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు 8247656581, 7680945357లను సంప్రదించాలని సూచించారు.

'అంగన్‌వాడీ సిబ్బంది విధుల్లో చేరాలి'



కొత్తూరు సీడీపీఓ కార్యాలయములో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ శాంతిశ్రీ

కొత్తూరు: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెను విరమించి విధుల్లో చేరాలని సమగ్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతి సూచించారు. జీతాలు తప్ప మిగిలిన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించిందని తెలిపారు. ఆమె గురువారం కొత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టును సందర్శించారు. కేంద్రాల నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. సంక్రాంతి తర్వాత జీతాలపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, సమ్మె విరమించి విధుల్లో చేరాలని సూచించారు. గర్భిణులకు అందించాల్సిన పౌష్టికాహారాన్ని సకాలంలో అందజేయాలని కోరారు. విధుల్లో చేరకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటామని చెప్పారు. కేంద్రాల నిర్వహణ సచివాలయ ఉద్యోగులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆమెతోపాటు కొత్తూరు సీడీపీఓ విమలకుమారి ఉన్నారు.

'సాక్షి' విలేకరి ఆత్మహత్య





రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) దామోదర్ (ఫైల్)

రణస్థలం: లావేరు మండలంలోని లావేటిపాలెం గ్రామానికి చెందిన లావేరు 'సాక్షి' విలేకరి గురిజా దామోదరరావు(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. జేఆర్ పురం పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దామోదరరావు ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన భార్య సుజాతను రణస్థలం మండల కేంద్రంలో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద దింపి వెళ్లారు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా వివరాలు తెలియకపోవడంతో జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జేఆర్ పురం పంచాయతీలో గల సీతంవలస గ్రామానికి సమీపంలో గల తోటల్లో గురువారం దామోదరరావు విగతజీవిగా పడి ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు వెళ్లి పరిశీలించిన పోలీసులు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు. అలాగే ఆయన చొక్కా జేబులో సూసైడ్ నోట్ లభ్యమైంది. అయితే పోలీసులు ఆ సూసైడ్ నోట్‌పై గోప్యంగా వ్యవహరించడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. లెటర్ బయటపెడితేనే మృతదేహాన్ని కదలనిస్తామని నిరసన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి డీఎస్పీ శృతి వచ్చి కుటుంబ సభ్యుల కోరిక మేరకు సూసైడ్ నోట్ బహిర్గతం చేశారు. అందులో 'నా చావుకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, లావేరుకు చెందిన లంకలపల్లి గోపిలే కారణం. వారు నన్ను అన్ని విధాలా మానసికంగా ఇబ్బంది పెట్టారు. దీంతో నేను స్ట్రెస్‌కు గురై ఆత్మహత్య చేసుకుంటున్నాను. వారిని విడిచిపెట్టవద్దు' అని రాసి ఉంది. దీంతో కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అయితే ఈ లెటర్‌పై మృతుడి సంతకం లేకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది.

విలేకరి మృతి దురదృష్టకరం

లావేరు సాక్షి విలేకరి దామోదర్ మృతి చాలా దురదృష్టకరం. నా వల్లే చనిపోయారని లెటర్‌లో పేర్లు రాసి దుష్ప్రచారం చేయడం దురదృష్టకరం. దామోదర్ నన్ను, పార్టీని గెలిపించడంలో చాలా సహాయపడ్డారు. లావేటిపాలెం గ్రామ పరంగా కూడా అంగన్‌వాడీ గురించి కానీ, పార్టీ కన్వీనర్లు గానీ అతను చెప్పినట్లే చేయడం జరిగింది. ఈ లెటర్‌లో ఏదో కుట్రకోణం ఉందని నేను భావిస్తున్నాను.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

యువభేరికి విద్యార్థుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి యువభేరి వేడుకలు జనవరి 5 నుంచి 9వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నుంచి పాల్గొనే విద్యార్థుల ఎంపికలు ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికారులు చెప్పారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, మహిళలు డిగ్రీ కళాశాల, జీసీఎస్ఆర్ రాజాం, కాకినాడ ఆదిత్య శ్రీకాకుళం, గురజాడ శ్రీకాకుళం రూరల్‌లో ఈ ఎంపికలు నిర్వహించనున్నారు. నృత్యం, చిత్రలేఖనం, సంగీతం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదుకున్న 108 సిబ్బంది

మందస, కాశీబుగ్గ:

గిరిజనుల పాలిట 108 అంబులెన్స్ వాహనం సంజీవనిగా మారుతోంది. మండలంలోని గిరిజన ప్రాంతమైన గోపాలసాయి అనే గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళను 108 సిబ్బంది గురువారం ఆదుకున్నారు. గ్రామానికి చెందిన సవర పావనికి గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందజేశారు. తక్షణం చేరుకున్న సిబ్బంది ఆమెను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా గొప్పిలి వద్ద పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఆర్సీపీ డాక్టర్ ప్రియ సలహాలతో సిబ్బంది పి.తిరుపతిరావు, కె.కోటేశ్వరరావు ప్రసవం చేశారు. మెడలో బొడ్డుతాడు అడ్డుపడినా జాగ్రత్తగా తల్లీబిడ్డను కాపాడారు. ప్రథమ చికిత్స అందజేసిన అనంతరం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో 108 సిబ్బందిని గర్భిణి కుటుంబసభ్యులు, బంధువులు, గిరిజనులు అభినందించారు.



108 వాహనంలో గిరిజన మహిళకు ప్రసవం చేసిన సిబ్బంది

జాతీయ తైక్వాండో పోటీలకు ఐదుగురు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన తైక్వాండో క్రీడాకారులతో కోచ్ లక్ష్మణరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఈ పోటీలు డిసెంబర్ 31 నుంచి జనవరి 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని బీతుల్ వేదికగా జరగనున్నాయి. ఎస్జీఎఫ్ జాతీయ పోటీలకు ఎంపికైనవారిలో అండర్–19 విభాగంలో 40 కేజీల బరువు కేటగిరీలో డి.వాణి (ఇంటర్మీడియెట్ సెకెండియర్–ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల శ్రీకాకుళం), అండర్–17 విభాగంలో 32 కేజీల బరువు కేటగిరీలో కె.తేజేశ్వని (10వ తరగతి – ఏపీఎస్ఎం హైస్కూల్ గుజరాతీపేట), అండర్–14 విభాగం 38 కేజీల బరువు కేటగిరీలో బెండి వేదశ్రీ (9వ తరగతి – కేంద్రీయ విద్యాలయం శ్రీకాకుళం), అండర్–17 విభాగం 51 కేజీల బరువు కేటగిరీలో ఆర్.వెంకట ప్రీతమ్ (ఇంటర్ ఫస్టియర్ – కేంద్రీయ విద్యాలయం శ్రీకాకుళం), అండర్–14 విభాగం 24 కేజీల కేటగిరీలో ఎల్.తేజేశ్వని (7వ తరగతి–శ్రీచైతన్య స్కూల్ శ్రీకాకుళం) ఎంపికయ్యారు. వీరంతా ఈ పోటీల కోసం గురువారం సాయంత్రం ఇక్కడ నుంచి పయనమై వెళ్తున్నారు. ఎంపికైన క్రీడాకారులను, శాప్ తైక్వాండో కోచ్ డి.లక్ష్మణరావును పలువురు అభినందించారు.

పింఛన్ పెంపుపై మార్గదర్శకాలు



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జనవరి నుంచి పింఛన్ పెంచనుండడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జనవరిలో జరిగే కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా నుంచి రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం, రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, శాసన మండలి సభ్యులు నర్తు రామారావు, మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల, పాతపట్నం ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, కాళింగ కార్పొరేషన్ అధ్యక్షుడు పేరాడ తిలక్, టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి, ఇచ్ఛాపురం మున్సిపల్ అధ్యక్షులు పి.రాజ్యలక్ష్మి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

'బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం రావాలి'

శ్రీకాకుళం క్రైమ్ : బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం రావాలని, ఉద్యోగుల పట్ల మేనేజ్‌మెంట్, కేంద్ర ప్రభుత్వం ఉదాసీనత చూపిస్తుందని ఎన్ఎఫ్‌టీఈ, బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యదర్శి కె.అంజయ్య అన్నారు. శ్రీకాకుళంలోని రామలక్ష్మణ జంక్షన్ సమీపంలో ఉన్న క్రాంతి భవన్‌లో గురువారం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల కార్యవర్గసభ్యులకు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఇరు జిల్లాల కార్యదర్శులు పి.నారంనాయుడు, జి.అప్పారావుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంజయ్య మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌లో ఉన్న వేతన సవరణ అమలు చేయాలని, ఒకే పరిశ్రమ–ఒకే పింఛను విధానం ఉండాలని, 4జీ సర్వీసు కల్పించడంలో ప్రభుత్వ ఉదాసీన వైఖరి విడనాడాలని కోరారు. అనంతరం ఆలిండియా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఇరు జిల్లాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులుగా హెచ్.వెంకన్నబాబు (జేఈ), కార్యదర్శిగా బి.సూర్యనారాయణ (ఏవోఎస్–జి), విజయనగరం జిల్లా అధ్యక్షులుగా జి.భాస్కరరావు (రిటైర్డ్ జేఈ), కార్యదర్శిగా జి.అప్పారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హెచ్.పాపన్న, డి.వెంకటేశ్వరరావు, బి.వాసుదేవరావు, యు.రామమోహనరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామమూర్తి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎ.షణ్ముఖరావు, డి.సుబ్బారావు, తిరుపతిరావులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



పురుషుల పరుగు పందెం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన అంతర పాలిటెక్నిక్ ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల మైదానంలో క్రీడలు గురువారం కొనసాగాయి. పోటీలను సాంకేతిక విద్యాశాఖ డీడీ రామకృష్ణ, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జానకి రామయ్య పర్యవేక్షించారు. మహిళల రిలే పరుగులో మౌనిక, ఝాన్సీ, రజిని, లావణ్య (వెంకటేశ్వర) మొదటి స్థానం సాధించారు. 200 మీటర్ల పురుషుల పరుగు పందాల్లో చంద్రయ్య (టీపీఆర్), మహిళల్లో హరిత (టీపీఆర్) మొదటి స్థానాలు సాధించారు. 400 మీటర్ల పరుగులో మహిళల్లో మౌనిక (వెంకటేశ్వర), భార్గవ జీపీటీ మొదటి స్థానాల్లో నిలిచారు. 100 మీటర్ల పరుగులో పురుషుల్లో హర్షవర్ధన్ (వెంకటేశ్వర), మహిళల్లో మౌనిక (వెంకటేశ్వర) విజేతలుగా నిలిచారు. జావెలిన్ త్రో విలియం (వెంకటేశ్వరావు), నాగరాజు (వెంకటేశ్వర), ఇర్ఫాన్ (జీపీటీ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 400–100 పురుషుల రిలేలో ఢిల్లీశ్వర రావు, నాగరాజు, యశ్వంత్, అభికిషన్ (వెంకటేశ్వర) మొదటి స్థానంలో నిలిచారు. 400–400 రిలే పురుషుల్లో హేమంత్, రాజేష్, ఫణీంద్ర, సాయికుమార్ (ఐతం) మొదటి స్థానంలో నిలిచారు. షాట్‌పుట్ పురుషుల్లో నాగరాజు (వెంకటేశ్వర), మహిళల్లో దుర్గాప్రశాంత (వెంకటేశ్వర)మొదటి స్థానంలో నిలిచారు. 800 మీటర్ల పరుగు పందెంలో పురుషుల్లో గోపీ (సీతంపేట), మహిళల్లో ఆకర్షణ(జీపీటీ) మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. 1500 మీటర్ల పరుగు పురుషుల్లో శ్యామ్(వెంకటేశ్వర) మొదటి స్థానం సాధించారు. హైజంప్‌లో నాగరాజు (వెంకటేశ్వర) మహిళల్లో ఝాన్సీరాణి (వెంకటేశ్వర) మొదటి స్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో చిన్నారావు (జీపీటీ), మహిళల్లో మౌనిక (వెంకటేశ్వరా) మొదటి స్థానం సాధించారు. ట్రిపుల్ జంప్‌లో మహిళల్లో శిరీష (జీపీడబ్ల్యూ), పురుషుల్లో వినయ్ (వెంకటేశ్వర) మొదటి స్థానంలో నిలిచారు. డిస్క్‌త్రోలో పురుషుల్లో నాగరాజు (వెంకటేశ్వర), మహిళల్లో రజిని (వెంకటేశ్వర) మొదటి స్థానంలో నిలిచారు. ముగింపు కార్యక్రమం శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించనున్నారు.